


KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 219 ఆదివారం 09 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar


## వైసీపీవి దిగజారుడు రాజకీయాలు

- నిమ్మల రామానాయుడు
- డీఎస్సీ నియామకాలను అడ్డుకోవడానికి వైసీపీ 356 పిటిషన్లు వేయించిందన్న నిమ్మల
- జగన్ అండ్ కో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మండిపాటు
- ఐదేళ్ల పాలనలో ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదో జగన్ చెప్పాలని డిమాండ్




**అమరావతి**

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాలను అడ్డుకోవడానికి గతంలో 356 పిటిషన్లు వేయించిన వైసీపీ, ఇప్పుడు నిరుద్యోగుల పేరుతో ఆందోళనలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. పాలకొల్లు నియోజకవర్గంలో రూ. 2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఎస్సీపై - మిగతా3లో

## 'వికసిత్ భారత్' సాకారంలో యువతదే కీలక పాత్ర

- సవాళ్లే అవకాశాలుగా మారుతాయి
- నేర్చుకునే వాడు గెలుస్తాడు
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిష్ఠాత్మక పురస్కారాల ప్రదానం
- స్వావలంబన అనేది వికసిత్ భారత్ అభివృద్ధికి పునాది





## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

- అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు
- అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు ఖరారు
- సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో పేర్లను చేర్చిన కేంద్ర ప్రభుత్వం

## గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు
# తిప్పికొట్టాలి

- చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు: చంద్రబాబు
- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి
- పార్టీలో క్రమశిక్షణ తప్పితే జీరో టాలరెన్స్ విధానం ఉంటుందని హెచ్చరిక



**అమరావతి**

ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" - మిగతా3లో

## దేశ స్వాతంత్ర్యం కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేసిందేం లేదు



- నీతులు మాత్రమే చెబుతుంటారు
- స్వాతంత్ర్య ఉద్యమంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించింది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేదు
- రాహుల్ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని ప్రశంస

## ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా?

- మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు
- అతి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనుంది
- కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సలహా
- అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చ
- ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశం




**అమరావతి**

స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమ య్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా - మిగతా3లో



## సరిహద్దులకు 1 కి.మీ పరిధిలో విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయొద్దు

- కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ
- ఎల్ఓసీ, ఎల్ఏసీ, అంతర్జాతీయ సరిహద్దులకు 1 కి.మీ. వరకు కొత్త ప్రాజెక్టులకు అనుమతి లేదు
- 50 కి.మీ. పరిధిని సున్నిత ప్రాంతంగా ప్రకటించిన కేంద్రం
- 50 కి.మీ.లోపు ప్రాజెక్టులకు హోంశాఖ అనుమతి తప్పనిసరి!

## ప్రభుత్వం పాలనను గాలికొదిలేసింది

- రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు
- కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్
- ఏపీలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందని షర్మిల ఆందోళన
- రాష్ట్రంలో 69 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, 50 లక్షల ఎకరాలు ప్రభావితమయ్యాయని వెల్లడి
- రైతులకు నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ సహా పలు డిమాండ్లు
- వెంటనే స్పందించకుంటే రైతులు, ఇతర వర్గాలతో కలిసి సర్కారు వెన్ను విరుస్తామని హెచ్చరిక



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ - మిగతా3లో



## మహిళా రిజర్వేషన్లకు షరతులెందుకు?

- రాహుల్, రిజిజు మధ్య మాటల యుద్ధం
- మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై కేంద్రాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీ
- డీలిమిటేషన్ ప్రక్రియతో రిజర్వేషన్లను ఎందుకు ముడిపెడుతున్నారని ప్రశ్న

# మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్



**విజయవాడ :** వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుం టాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజక వర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది. వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు. జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద జెన్ జీ ప్రస్తావన తేవడం మారిన వైసీపీ స్ట్రాటజీకి నిదర్శనమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా




**కాకినాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పథ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు. కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు లాగిపడేశారని.. మా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు యువతను లక్ష్యంగా చేసుకుని రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని జగన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేశారన్న జగన్.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని ఆరోపించారు. దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి, నిరసనకారులను అరెస్టు చేసి, నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరని.. ఆంధ్రప్రదేశ్ గొంతును మూయలేరంటూ జగన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ ట్వీట్ 2029 ఎన్నికలకు వైసీపీ స్ట్రాటజీని తెలియజేస్తోందని పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నిరసనలు, ఆందోళన కార్యక్రమాల వైపు యువతరాన్ని ఆకర్షించి, వారి భాగస్వామ్యులను చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

## తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన

**విజయవాడ:** రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ ప్రక్షాళన అంశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక ప్రభుత్వం కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం అధికార వర్గాలు, రాజకీయ విశ్లేషకుల మధ్య జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పనితీరుపై స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ వ్యాఖ్యలను భవిష్యత్‌లో జరిగే మంత్రివర్గ మార్పులకు సంకేతాలుగా పలువురు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక ఎన్నికలను అత్యంత కీలకంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రతిపక్ష విమర్శలకు వెంటనే సమాధానం ఇవ్వాలని ఆయన సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు చేరకపోతే ఆశించిన రాజకీయ ఫలితాలు రావని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కొన్ని శాఖల్లో నిర్ణయాల అమలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఫైళ్ల పరిష్కారంలో జాప్యం కనిపించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం తగ్గడం వంటి అంశాలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాఖలపై పూర్తి పట్టు సాధించి ఫలితాలు చూపించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రులకు సూచించినట్లు సమాచారం. ప్రతి అంశంలో ముఖ్యమంత్రి జోక్యం అవసరం లేకుండా ఆయా శాఖల మంత్రులే ముందుండి పనిచేయాలని స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రుల బాధ్యతల విషయంలో కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. జిల్లాల్లో పార్టీ నాయకుల మధ్య సమన్వయం పెంచడం, అంతర్గత విభేదాలను తగ్గించడం, స్థానిక స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంపై తన దృష్టికి ఫిర్యాదులు వచ్చినట్లు కూడా ఆయన ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. స్థానిక ఎన్నికల్లో కూటమి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం ప్రతి మంత్రి క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల తర్వాత మంత్రుల పనితీరును సమగ్రంగా సమీక్షించి అవసరమైతే కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇప్పటివరకు మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళనపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## ప్రభుత్వం పాలనను గాలికొదిలేసింది

-మొదటిపేజీ తరువాయి

పరిస్థితులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. "పాలనను గాలికొదిలేసి, కులమత కొట్లాటల్లో, కేసుల్లో, మోదీ పొగడ్త సభల్లో మీరు, మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజీగా ఉన్నారు. అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ ఒకటే. వీరికి రాష్ట్రం, ప్రజల బాగోగులు పట్టవు" అని ఆమె వ్యాఖ్యానించారు. ఆరేడు నెలలుగా ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కనీస కంటింజెన్సీ ప్రణాళికలు కూడా సిద్ధం చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాల వారీగా సమీక్షలు, రైతులకు మార్గదర్శకాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం క్వాంటం, డేటా సెంటర్లంటూ కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నారని, మిమ్మల్ని నమ్ముకున్న లక్షలాది రైతుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరఫున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.

**కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు:**

1. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలి.
2. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి.
3. రిజర్వాయర్ల నుంచి చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందేలా చూడాలి.
4. వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి.
5. రైతులకు కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలి.
6. ఎల్‌నినో నష్టాలను అంచనా వేసి ప్రతి రైతుకు ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలి.
7. పశుగ్రాసం కొరత తీర్చేందుకు పాడి రైతులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వాలి.

తక్షణమే మేల్కొని మంత్రులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపి రైతులను ఆదుకోవాలని షర్మిల సూచించారు. "ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే రైతులు, ఇతర వర్గాల ప్రజలతో కలిసి మీ సర్కారు వెన్ను విరిచి మరీ నిలదీస్తారని మరవకండి" అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి

-మొదటిపేజీ తరువాయి

అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు. గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## వైసీపీవి దిగజారుడు రాజకీయాలు

-మొదటిపేజీ తరువాయి


జగన్ అండ్ కో రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని, వారి కుట్రలకు ప్రభుత్వం తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. పదేళ్ల పాటు అభ్యర్థులు కష్టపడి కోచింగ్ తీసుకుని ఉద్యోగాలు సాధిస్తే, వైసీపీ మాత్రం స్వార్థ ప్రయోజనాల కోసం నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుం టోందని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి ఏటా డీఎస్సీ వేస్తానని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పడమే కాకుండా... తన ఐదేళ్ల పాలనలో ఎందుకు ఉద్యోగాలు భర్తీ చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న జగన్ వెంటనే వైసీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని అన్నారు. చరిత్రలో 2 లక్షలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు.

## ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా?

-మొదటిపేజీ తరువాయి

ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై




కూడా చర్చించారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు. ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు నివేదించారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ. 3.5 కోట్ల వరకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది ఎంత బడ్జెట్ అవుతుందో కూడా చర్చించారు

# దివ్యాంగులకు మోక్ష క్రియేషన్స్ నరేంద్ర చేయూత.

పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 8

పులివెందులపట్టణంలోని మారుతి హాల్ రోడ్డులో ఉన్న మోక్ష క్రియేషన్స్ యజమాని తల్లం నరేంద్రకుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో టైలరింగ్ శిక్షణ కేంద్రశీలో ఏర్పాటు చేసిన ఒకకార్యక్రమంలో ఆయన తన మిత్రబృందం, దివ్యాంగుల సమక్షంలో జన్మదిన కేక్ కట్ చేసి అందరికీ అందించారు. ఈసందర్భంగా వారి మిత్రులు, దివ్యాంగులు నరేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేంద్ర తన పుట్టినరోజు కానుకగా దివ్యాంగుల కుట్టుశిక్షణా కేంద్రానికి ఆర్థికసహాయం అందించారు. తదనంతరం వికలాంగుల నెట్ వర్క్ కార్యవర్గ సభ్యులు దాత నరేంద్రను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, సహాయ కార్యదర్శి శివాజీ రాజారెడ్డి, విజయదుర్గా జ్యువెలర్స్ యజమాని పృథ్వీ కృష్ణ, వినోద్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు వినయ్, మణికంఠ, టైలరింగ్ సెంటర్ టీచర్ మల్లీశ్వరి, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.



# డీఎస్సీ-2025 స్కామ్‌పై సీబీఐ విచారణ చేపట్టాలి

**-- నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి**

**- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదు**




పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 8

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ నియామకాలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, సీబీఐ విచారణ కోరుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. వాటిలో భాగంగా పులివెందులలో మూడవరోజు ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణ సమీపంలో దీక్షలు కొనసాగుతున్నాయి, శనివారంమూడవ రోజు రీలే నిరహార దీక్షకులివేములలి ,వేంపల్లిలి ,సింహాద్రి పురం మండలనాయకులు కార్యకర్తలు,దీక్షకు మద్దతుగా యూత్ నాయకులు ఆధ్వర్యంలో యూత్ రాబోయే తరానికి బావి పౌరులు, ఎరుకుల సంఘం నాయకులు మరియు ఆర్ఎంపీ డాక్టర్ల యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సింహాద్రిపురం మండల వైకాపా నాయకుడు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 2025 లో జరిగిన మెగా డీఎస్సీ పై సీబీఐ దర్యాప్తు చేయాలి అని,అలాగే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డిఎస్సీ అవకతవకలపై బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని,విద్యార్థులు నిరుద్యోగుల సమస్యలపై వైఎస్ఆర్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపు తో వైఎస్ఆర్సీపీ ఆద్వర్యం లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష లో మోసపోయిన నిరుద్యోగులకు విద్యార్థులకు డీఎస్సీ పరీక్షా విధానంలో అవకతవకలు, పేపర్ లీకేజీలు జరిగాయని, చాలామంది నిరుద్యోగులు తీవ్రంగా నష్ట పోయారు




అని, కేంద్రంలో ఒకలా, రాష్ట్రంలో మరోలా కాకుండా నైతిక బాధ్యత వహించి లోకేష్ వైదొలగాలని డిమాండ్ చేశారు.లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం నారా లోకేష్ ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి అని వారు డిమాండ్ చేశారు.అలాగే ఈ సమగ్ర వ్యవహారంపై సీబీఐ లేదా స్వతంత్ర సంస్థతో విచారణ జరపాలని వారు కోరారు.నీట్ పేపర్ లీకేజీ ను తలదన్నే రీతిలో రాష్ట్రం లో సాగిన డీఎస్సీ-2025 కుంభకోణం పక్క సాక్ష్యాధారాలతో రుజువైన చంద్రబాబు ప్రభుత్వం మసిపూసి మారేడు కాయ చేసిందన్నారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి నియామకాల వరకు జరిగిన గోల్ మాల్ పై ఆధారాలు కళ్లెదుటే కనిపిస్తున్న బాబు ప్రభుత్వం బాధ్యత వహించలేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డీఎస్పీ అభ్యర్థులకు జరిగిన నష్టానికి ,యువతకి జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరసన ర్యాలీ కి సంఘీభావంగా స్వచ్ఛందంగా తరలి రండి

**-రేపు జరగబోయే ర్యాలీని విజయవంతం చేయండి**

**-వైకాపా నాయకులు పిలుపు**

పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 8

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని , డీఎస్సీ లీకేజీ పై అవకతవకలపై భాద్యత వహిస్తూ నారా లోకేష్ రాజీనామా చేయాలని , విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి క్రింద ప్రతి నిరుద్యోగికి నెలకు (3000/-) మూడు వేల రూపాయలు తక్షణమే చెల్లించాలని గత మూడు రోజులుగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్న విషయం తెలిసిందేనని మున్సిపల్ మాజీచైర్మన్ వరప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ లు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిరసన పోరాటం లో భాగంగా పదో తేదీ సోమవారం ఉదయం 09:00 గంటలకు పులివెందుల లోని స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ నిరసన ర్యాలీ కి సంఘీభావంగా నిరుద్యోగ యువత, విద్యార్థులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల వారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి మద్దతు



తెలపాలని వారి కోరారు. ఈ ర్యాలీ కార్యక్రమానికి ఎంపీ వైయస్అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జి ఓఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు మండలం వైకాపా ఇన్చార్జి వైఎస్ మదనమోహన్ రెడ్డి, వైకాపా ప్రధాన కార్యదర్శి ఎస్ వి సతీష్ కుమార్ రెడ్డి లో పాల్గొన్నట్లు వారి తెలిపారు. మీ వ్యాలీ ని విజయవంతం చేయాలని ఈ ర్యాలీతో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కళ్ళు తెరుచుకోవాలన్నారు.

# బాల నాగమ్మ నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

పులివెందుల రురల్ కదిలించే వార్త ఆగస్టు 8



పులివెందుల మండలం ఎర్రిపల్లి గ్రామానికి చెందిన లింగాల బాల నాగమ్మ (75) మరణించడంతో ఆమె కుమారులు సర్వోత్తం రెడ్డి,గోపాల్ రెడ్డి,కుమార్తెలు భవాని,వరలక్ష్మి, లత, కోడళ్ళు రాములమ్మ,లక్ష్మీదేవి, అల్లుళ్ళు వెంకటరామిరెడ్డి,సుధాకర్ రెడ్డి,సోమశేఖర్ రెడ్డి లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు కు సమాచారం అందించారు. దీంతో టెక్నీషియన్ అరవింద్ తో కలిసి మృతురాలి నివాసానికి చేరుకున్న రాజు, పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, "నేత్రదానం అనేది మరణానంతరం కూడా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపగలిగే మహోన్నత దానం. ప్రతి కుటుంబం నేత్రదానంపై అవగాహన పెంపొందించుకొని, తమ కుటుంబ సభ్యుల కోరిక మేరకు నేత్రదానానికి ముందుకు రావాలి. సమాజంలో అంధత్వ నిర్మూలనకు నేత్రదానం ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. లింగాల బాల నాగమ్మ కుటుంబ సభ్యులు చూపిన ఈ మానవతా



దృక్పథం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది" అని అన్నారు. అలాగే, నేత్రదానం చేయాలనుకునే వారు లేదా నేత్రదానానికి సంబంధించిన సమాచారం కోసం 9966509364 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. నేత్రదానానికి సహకరించిన మృతురాలి కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు,జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితి తరఫున రాజు కృతజ్ఞతలు తెలిపారు.

# వేంపల్లె పోలీస్‌స్టేషన్ ఆవరణలో పచ్చదనం పరిమళం

**-మొక్కలు నాటిన పోలీసులు.. పర్యావరణ పరిరక్షణకు చొరవ**

**-నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ**



వేంపల్లె(కదిలించే వార్త)ఆగస్టు 8 :

పర్యావరణ పరిరక్షణలో భాగంగా వేంపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది శనివారం స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో పలు రకాల మొక్కలను నాటి వాటికి నీరు పోశారు.ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించినప్పుడే ఆశించిన ఫలితం లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు.పోలీస్‌స్టేషన్ పరిసరాలను పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చడంతో పాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి వాటిని సంరక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వేంపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# దివ్యాంగులకు అన్నదానం- ప్రకృతి రైతుకు ఆర్థిక సహాయం



సింహాద్రిపురం కదిలించే వార్త ఆగస్టు 8 సింహాద్రిపురం మండలం కసునూరు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు స్వర్గీయ కటికరెడ్డి రామచంద్రారెడ్డి ఆరవ వర్ధంతిని పురస్కరించుకుని కటికరెడ్డి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన ఒకకార్యక్రమంలో, వారికుటుంబసభ్యులు కటికరెడ్డి రామాశీజులరెడ్డి, లక్ష్మీదేవమ్మ తదితరులు, ఆయన పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనంపాటించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు, జానపద కళాకారుడు, రేలారే రేలా ఫేశీ నాగరాజుకు పదివేల రూపాయలు ఆర్థికసహాయం చెక్కు రూపంలో అందించారు. ఈసందర్భంగా దివ్యాంగులు కటిక రెడ్డి లక్ష్మీదేవమ్మ, రామగిరి జనార్దన్ రెడ్డి లను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తదనంతరం దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని జానపద కళాకారుడు రేలా రేలా నాగరాజు పాడిన పాటలు అందరినీ అలరించాయి. లిఈకార్యక్రమంలో కటికరెడ్డి లక్ష్మీదేవి, కటికరెడ్డి రామాంజనేయరెడ్డి, వికలాంగులు నెట్ వర్క్ అధ్యక్షులు డా.ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, ప్రముఖ స్వచ్ఛంద సేవకులు నక్కలపల్లె కొండారెడ్డి, రామగిరి జనార్ధనరెడ్డి, దేవపుత్రారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, భరత్ రెడ్డి, నాగరాజు, వసుంధరమ్మ, నీలకంఠారెడ్డి, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ కృషితో పారదర్శకంగా డీఎస్సీ ఫలితాలు

**-సర్ ప్రక్రియ సక్రమ నిర్వహణలో ఎన్నికల కమిషన్ సఫలం**

**-తెదేపా మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి**



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 8

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో డీఎస్సీ ఫలితాలు పారదర్శకంగా వెల్లడయ్యాయని, సర్ ప్రక్రియ సక్రమ నిర్వహణలో ఎన్నికల కమిషన్ సఫలమైనదని, డీఎస్సీ ఫలితాలపై వైకాపా ఆరోపణలు సరికాదని పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో రెండు లక్షల 30 వేల ఓట్లు ఉన్నాయని అందులో సర్ ప్రక్రియలో 30 వేల ఓట్లు తొలగిపోయాయని, ఈ ఓట్లు తొలిగి పోవడంతో వైకాపా నాయకుల పరిస్థితి బట్టబయలైనదని, 2024 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో జగన్మోహన్రెడ్డి 61000 పైచిలుకు ఓట్లతో గెలవడం, ఇందులో 30 వేల ఓట్లు డబల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లని తీసేస్తే ఇంకా భారీ మెజార్టీ తగ్గే ఉండేదన, 2025 లో డీఎస్సీ జరిగితే అప్పటినుండి వైకాపా నాయకులు కామ్ గా ఉండి ఇప్పుడు ఏడవడం ఏమిటని, మంత్రి నారా లోకేష్ ఇంత పారదర్శకంగా డీఎస్సీ ఫలితాలను విడుదల చేస్తే దీని స్పోర్ట్స్ కోటాలో ఇచ్చారని వైకాపా నాయకులు ఇప్పుడు ఏడవడం భావ్యం కాదన్నారు. డీఎస్సీ పైన రిలే నిరాహార దీక్షలు ర్యాలీలు చేయడం భావ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఎలినోన్ ప్రభావం ఉంటే వాటిపై జగన్మోహన్ రెడ్డి మాట్లాడకుండా కేవలం డిఎస్సి పైనే మాట్లాడి ప్రజల వద్ద అభాసు పాలవుతున్నారన్నారు. ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేస్తూ ఉంటే ఓర్వలేని వైకాపా నాయకులు ఈ విధంగా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సర్ ప్రక్రియ దేశంలో జరుగుతూ ఉంటే చాలామందికి బిజెపిపై అనుమానం ఉండేదని, ఈ సర్ ప్రక్రియపై నాక్కూడా అనుమానం ఉండేదని, సర్ ప్రక్రియ జరిగిన తర్వాత ఫలితాలు చూస్తే నిజాలు బట్టబయలు అయ్యాయని, భారత్ ప్రభుత్వానికి,ఎన్నికల కమిషన్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో అంజన్నకు విశేష పూజలు



సింహాద్రిపురం కదిలించే వార్త ఆగస్టు 8సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన అష్టోత్తర శతనామావళి ఆకు పూజ తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి శనివారం ,మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రికి నివాళులర్పించిన వైఎస్ సునీత



పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 8

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 75వ జయంతి సందర్భంగా పులివెందులలోని ఆయన సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, తండ్రి హత్య కేసు విచారణలో మరియు తీర్పులలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు తన పోరాటం కొనసాగిస్తానని, న్యాయం కోసం నిరంతరం పోరాడుతనాని,తనకు ఏదో ఒక రోజు కచ్చితంగా న్యాయం లభిస్తుందనే నమ్మకం ఉందనిస్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్ వివేక కుటుంబ సభ్యులు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు

# తిరుపతి కి విచ్చేసిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ

తిరుపతి కదిలించే వార్త 8 ఆగస్టు

ఏపీ మంత్రి నారాయణ స్వాగతం పలికారుపుష్పగుచ్ఛం అందిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ఎఫ్.ఏ.సి. శారదా దేవి అధికారాలు స్వాగతం పలికారు



# వృషభాచలేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన సేవ

-ప్రతి శనివారం భక్తులకు ఉచిత అన్న ప్రసాదం.. దాతలు సహకరించాలి

-భక్తులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలి: ఆలయ నిర్వాహకులు





వేంపల్లె(కదిలించే వార్త)ఆగస్టు 8 :

వేంపల్లి పట్టణంలోని పాపాగ్ని నది తీరాన ఎద్దులకొండపై వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ పి.వి.రమణ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం దాతల సహకారంతో భక్తులకు ఉచిత అన్న ప్రసాదం అందించాలని నిర్ణయించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదం అందించడం ద్వారా సేవా కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.అన్నదాన కార్యక్రమానికి భక్తులు, దాతలు ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. దాతల సహకారంతో ప్రతి శనివారం అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సేవకు సహకరించే దాతల పేర్లను దేవస్థానం బోర్డుపై ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.అన్న ప్రసాద వితరణకు సహకరించే దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రత్యేక గౌరవం కల్పించనున్నట్లు తెలిపారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కడప సుభాష్, చైర్మన్ పి.వి.రమణ, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లెల్లో బెల్టు షాపులను అరికట్టాలి

-మద్యం షాపుల నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

-పోలీసులకు కాంగ్రెస్ నేత ధ్రువకుమార్‌రెడ్డి వినతి



వేంపల్లె(కదిలించే వార్త)ఆగస్టు 8 :

వేంపల్లె మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న మద్యం బెల్టు షాపులను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ (సమన్వయకర్త) మూలం రెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల నడిబొడ్డున, ప్రధాన రహదారుల వెంబడి మద్యం విక్రయాలు కొనసాగడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నివాస ప్రాంతాల సమీపంలో మద్యం విక్రయాలు జరగడం వల్ల అక్కడే మద్యం సేవించి తిరిగే వ్యక్తులతో మహిళలు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన తెలిపారు. కూలి పనులు చేసుకుని సంపాదించిన డబ్బును కొంతమంది మద్యానికి ఖర్చు చేస్తుండటంతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా చేసి పేద కుటుంబాలను మద్యం దుష్ప్రభావాల నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.వేంపల్లెలోనూ మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి ముందే తెరుస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని ధ్రువకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులను పూర్తిగా అరికట్టాలని పోలీసులను కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వేంపల్లె, వేముల, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, రామాంజనేయరెడ్డి, కిసాన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బద్రీనాథ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు వేమయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు ఉత్తన్న, మండల ప్రధాన కార్యదర్శి వెంకట రాఘవ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# శ్రావణ ఉత్సవాలకు గండి క్షేత్రం సన్నద్ధం

-వేలం పాటలు, టెండర్ల ప్రక్రియ పూర్తి



గండి(కదిలించే వార్త)ఆగస్టు 8 : గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రావణమాస ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి శనివారం ఆలయ అధికారులు బహిరంగ వేలం పాటలు, సీల్డ్ టెండర్లు నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ఎస్సై, ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యుల సమక్షంలో వేలం ప్రక్రియ నిర్వహించారు.ఆలయంలో ప్రత్యేక పూల అలంకరణ టెండర్‌ను కడపకు చెందిన జి.మోహన్ రూ.4.90 లక్షలకు దక్కించుకున్నారు. భక్తుల సెల్‌ఫోన్లు, లగేజీ భద్రతకు సంబంధించి టెండర్లలో కోట్ చేసిన ధరలు అధికంగా ఉండటంతో ఆలయ యాజమాన్యమే స్వయంగా సమాచార కేంద్రం వద్ద ఉచితంగా లగేజీ, సెల్‌ఫోన్ భద్రత సదుపాయం కల్పించాలని నిర్ణయించింది.సుమారు 450 ఖాళీ నెయ్యి డబ్బాల వేలంలో వేంపల్లికి చెందిన రవి ఒక్కో డబ్బాకు రూ.22 చొప్పున హెచ్చు పాటదారుగా నిలిచారు. వాయుపుత్ర కాంప్లెక్స్ షాప్ నంబర్ 41ను రమణ నెలకు రూ.4,700కు, సర్వే నంబర్ 735లోని 1.28 సెంట్ల స్థలాన్ని సి.శ్రీనివాసులు ఏడాదికి రూ.14 వేల చొప్పున దక్కించుకున్నారు. మిగిలిన ఐదు షాపు రూములకు ఎవరూ వేలంలో పాల్గొనకపోవడంతో వాటి వేలం పాటను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు.అనంతరం ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, ఆర్టీసీ, విద్యుత్, వైద్య, రెవెన్యూ శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆలయ సహాయ కమిషనర్ సూచించారు. సమావేశంలో ఆర్టీసీ డీఎం ఎ.ప్రేమ్‌కుమార్, విద్యుత్ ఈఈ ఎం.రఘు, ఏఈ గిరిధర్, డాక్టర్ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు. కడప రిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి భక్తుల నుంచి మంచి స్పందన లభించింది.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

-ఖాళీ పోస్టులు భర్తీ చేసి.. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి



వేంపల్లె (కదిలించే వార్త), ఆగస్టు 8:

డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలు, అవకతవకలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం పులివెందులలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇడుపులపాయ గ్రామం నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సంఘీభావం తెలిపారు.జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇడుపులపాయ గ్రామ పంచాయతీ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పోతిరెడ్డి మహేష్ ఆధ్వర్యంలో పలువురు పులివెందులకు వెళ్లారు.ఈ సందర్భంగా పోతిరెడ్డి మహేష్ మాట్లాడుతూ డీఎస్సీ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఇడుపులపాయకు చెందిన వైసీపీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# వైకాపా పగటి వేషాలను జెంజి యువత నిశితంగా గమనిస్తున్నారు - డాక్టర్ జీలాన్



కడప ఆగస్టు 8 కదిలించే వార్త వైఎస్ఆర్ పార్టీ చేసే పగటి వేషాలను జంజి యువత, ప్రజలు ,విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జులాన్ భాష తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వైయస్సారు ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూతమ బాధ్యతలను నిర్వర్తించని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి ఇది 'జెన్–జీ' యువత డిమాండ్ అన్నారు.యువకుల పట్ల భస్మాసుర హస్తంలా గత 5 సంవత్సరాలు వ్యవహరించిన వైస్సార్సీపీ పార్టీ ,కూటమి ప్రభుత్వం పైన విమర్శించే నైతిక హక్కు లేదు తెలిపారు . టీడీపీ ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు ఆమోదయోగ్యం కాదు. తమ ఉనికి కోసం వైఎస్సార్‌సీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోంది అన్నారు. ఇది చాలా సిగ్గుచేటు, మేము దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము అని తెలిపారు టిడిపి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా మరియు జవాబుదారీతనంతో పనిచేస్తోంది. యువత ఆశయాలు టిడిపి పాలనలోనే నెరవేరుతాయి. డీఎస్సీ ప్రక్రియ పైన అసత్య ఆరోపణలు చేయడం శోచనీయం . ఆధారాలు ఉంటె న్యాయస్థానాలను ఆశ్రయించకుండా రోడ్ల పై చౌకబారు రాజకీయాలు చేయడం వైకాపా దిగజారుడు వ్యవహారాలకు నిదర్శనం అన్నారు . క్రీడాకారులకు దివ్యాంగులకు అణగారిన వర్గాలకు సమ న్యాయం చేసి ఉద్యోగ ఉపాధి కల్పన చేయడం కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనం తెలిపారు ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ జిలాని పాలగిరి రసూల్ తదితరులు పాల్గొన్నారు .

# 23 ఏళ్లుగా కనీస వసతులకు నోచుకోని పేదల కాలనీలు

-మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై

-సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ చంద్రశేఖర్ సూటి ప్రశ్న




కడప ఆగస్టు. 8 కదిలించే వార్త

పట్టణంలోని ఇన్సాఫ్ నగర్, మార్తోమా నగర్, జంగాల కాలనీ, గౌరీ శంకర్ నగర్ ప్రాంతాల్లో 23 సంవత్సరాలుగా రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్. చంద్రశేఖర్ ఆరోపించారు.శనివారం ఆయా కాలనీల్లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించిన ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండటం, కంప చెట్లు పెరగడం, దోమలు, విష సర్పాల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్న మున్సిపల్ అధికారులు పేదల కాలనీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.పేదలు, దళితులు, బీసీలు, మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో తక్షణమే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, లేకపోతే ప్రజల తరఫున ఉద్యమాలు చేపడతామని చంద్రశేఖర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బి. చంద్రమోహన్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు కే. జకరయ్య, నాయకులు కే. బాబు, రామరాజు, విజయరావు, జయరామరాజు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన.. పవిత్ర పుణ్యక్షేత్రమైన అన్నదానం



తిరుపతి కదిలించే వార్త ఆగస్టు 8 తిరుపతి నగరం ప్రతి శనివారం తెల్లవారుజామున భక్తి పారవశ్యంలో మునిగిపోతోంది. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి శనివారం నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. శనివారం బ్రహ్మముహూర్తంలోనే భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుట గోవింద నామాలతో గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీహరి నామస్మరణతో నగర సంకీర్తన ప్రారంభమై నాలుగు మాడవీధుల్లో కొనసాగింది. 'గోవింద... గోవింద...' నామస్మరణతో తిరుపతి వీధులు మార్మోగగా, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఇంటిలో భక్తి భావం వెల్లివిరియాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ నగర సంకీర్తన భక్తి, సేవ, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. సంకీర్తన అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో నగర సంకీర్తనలో పాల్గొని పునీతులు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి నగర సంకీర్తన ప్రారంభమవుతుందని, నాలుగు మాడవీధుల్లో జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త చంద్రమౌళి, మునెప్పగారి మునినాథరెడ్డి, పి కృష్ణమరాజు , వాసుదేవ రెడ్డి , అన్నూరు మునిరత్నమాచారి, పురుషోత్తమ యాదవ్, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, అరుణమ్మ, జయమ్మ, విజయకుమారి, అమరావతి, పావని, ఉషశ్రీ, సుశీల, రేవతి, ఉమా, పద్మ, వై.పద్మావతి, సిద్ధమ్మ, ధనమ్మ, కల్పన, నాగరాజమ్మ, పద్మావతి, కళ్యాణి, సుశీలమ్మ, నాగరాజు రెడ్డి, అత్తూరు నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కడప కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌కు గెలుపు ఖాయం.

-కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్



కడప ఆగస్టు 8 కదిలించే వార్త

కడప కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 3వ విడత "ఇంటింటికీ కాంగ్రెస్" కార్యక్రమాన్ని డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి పార్టీ విధానాలు, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి,కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ లు మీడియాతో మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. రాబోయే కడప కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం 30 డివిజన్లలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల మధ్యే ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రజలకు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తున్నారని చెప్పారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఇప్పటి నుంచే పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కలసికట్టుగా పార్టీ కోసం పని చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం పిసిసి అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు అంజన్ కుమార్, కరీం, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, మహిళా జిల్లా అధ్యక్షురాలు సుభాన్ బి, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కోటపాటి లక్ష్మయ్య , రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు బాష, జిల్లా జనరల్ సెక్రెటరీలు సుధాకర్, శామీర్ హుస్సేన్,జాబీర్ అలీ, సిద్ధిక్, గఫార్, సుబ్రహ్మణ్యం, మహబూబ్ బాషా, సాదిక్, డివిజన్ ఇంచార్జ్ లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**-ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి:**
**-ఆర్ఎస్‌యూ ఉమ్మడి కడప జిల్లా 13వ మహాసభలు విజయవంతం**







కడప ఆగస్టు 8 కదిలించే వార్త కడప నగరంలోని శంకరాపురం శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆర్ఎస్‌యూ ఉమ్మడి కడప జిల్లా 13వ మహాసభలు విజయవంతంగా జరిగాయి. జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండంనాటి ప్రశాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ మహాసభల్లో నూతన జిల్లా కమిటీని ఎన్నుకుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు రాఘవ, జశ్వంత్, ఈశ్వర్, బిట్టు, గౌతమ్, కిరణ్, వంశీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన శుక్రవారం శ్రీ దుర్గా భవాని అమ్మవారీఒడి బియ్యం కార్యక్రమం

**సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 54 శుక్రవారాలు జరగనున్న ఒడిబియ్యం, 5రోడ్ లోని దుర్గ భవాని దేవాలయంలో కార్యక్రమంఅమ్మ వారికి 21 వారం ఘనంగా జరిగింది.**





అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 08 :పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణం నిమ్మకాయ , దీపాలతో పూజ ఖడ్గమాల , మణిదీప వర్ణన, కనకదార శోత్రంమొదలగు పూజలు నిర్వహించారు. అనంతరం ఆషాఢ మాసంలో నాల్గవవ శుక్ర పురస్కరించుకొని శ్రీ దుర్గ భవానీఅమ్మవారికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఓడి బియ్యం పెట్టీనారు.ఆషాడ మాసంలో కేవలం అమ్మవారి మాత్రమే ఒడిబియ్యం కార్యక్రమం ఉంటుంది మహిళలకు ఉండదు54 వారాలకు ఆర్థిక సహాయాన్ని శ్రీమతి రుక్మిణి సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాతృమూర్తి ఆర్థిక సాయం అందిస్తున్నారుముఖ్య అతిథిగా న్యూ. టౌన్ అమ్మవారిశాల అధ్యక్షురాలు నిర్మల పాల్గొన్నారు..ఆలయ నిర్వాకులు హేమవతి, చతుర్వేది కార్యక్రమాన్ని శాస్త్రోతంగానిర్వహించినారనీ సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సేవకర్త రుక్మిణీ , ఇందుమతి శ్యామల భువన పల్లవి లక్ష్మిసాయి ట్రస్ట్ బృందం రాఘవేంద్ర,నరేష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# అనారోగ్య బాధిత కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

**ధర్మవరంలో 32 మంది లబ్ధిదారులకు ?15,36,742 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**ప్రతి పేద కుటుంబానికి అండగా ఎన్డీఏ ప్రభుత్వం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు మూల సూత్రం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడే కుటుంబాలకు జవీ=ఖీ గొప్ప వరం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ప్రతి అర్హుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా చర్యలు తీసుకుంటున్నాం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**పేదల వైద్య భరోసాకు పెద్ద దిక్సూచి... ముఖ్యమంత్రి సహాయ నిధి -- మంత్రీ సత్యకుమార్ యాదవ్**





ధర్మవరం, కదిలించే వార్త, ఆగస్టు 08 :-- ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనారోగ్య సమస్యలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిచ్చేలా నిలిచింది. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన మొత్తం 32 మంది లబ్ధిదారులకు రూ.15,36,742 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను మంత్రి సత్యకుమార్ యాదవ్ స్వయంగా పంపిణీ చేశారు. ఖరీదైన వైద్య చికిత్సల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. అనారోగ్యం అనేది ముందస్తు హెచ్చరిక లేకుండా ఎవరినైనా, ఎప్పుడైనా ప్రభావితం చేసే పరిస్థితి అని, అలాంటి క్లిష్ట సమయంలో కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. పేద ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. వైద్య ఖర్చుల భారంతో ఏ కుటుంబమూ ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారికి వేగంగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అందించేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నామని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు కొనసాగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ క్లిష్ట సమయంలో అందించిన ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబాలకు ఎంతో అండగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు.

## జనతా వారధిలో ప్రజలతో ముఖాముఖి... సమస్యల పరిష్కారానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవ

**జనతా వారధిలో ప్రజల అర్జీలు స్వీకరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్...**

**అర్జీ స్వీకరణ కాదు... సమస్యకు పరిష్కారమే లక్ష్యం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ప్రజల నమ్మకమే మా బలం... సమస్యల పరిష్కారమే మా లక్ష్యం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ప్రజలే ప్రాధాన్యం... సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం -- మంత్రి సత్యకుమార్ యాదవ్**





ధర్మవరం, కదిలించే వార్త, ఆగస్టు 08 :-- ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన జనతా వారధి కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొని నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, మండలాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వయంగా స్వీకరించి వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తమ సమస్యలను నేరుగా మంత్రికి వివరించే అవకాశం లభించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, సమస్యల స్వరూపాన్ని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయం చేసి పరిష్కార దిశగా చర్యలు ప్రారంభించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా భూ సంబంధిత అంశాలు, రెవెన్యూ సమస్యలు, తాగునీటి సౌకర్యం, రహదారుల అభివృద్ధి, విద్యుత్ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన వినతులు పెద్ద సంఖ్యలో అందాయి. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను నేరుగా స్వీకరించి, వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టేలా అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాదు... వాటికి శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రజాప్రతినిధిగా నా బాధ్యత. ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకొని, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే వరకు నిరంతరం పర్యవేక్షిస్తాం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శకంగా, జవాబుదారీతనంతో పనిచేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా సమానంగా ముందుకు తీసుకెళు తున్నామని మంత్రి తెలిపారు. ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రజల సహకారంతో మరింత కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాలు మరియు వార్డుల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై పోరాటం..

**దీక్షలో పాల్గొని మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు**




అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 08 :

డీఎస్సీ-2025 నియామకాల్లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు హాజరై తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్షల మెరిట్ జాబితాను, స్పోర్ట్స్ కోటా జాబితాను ప్రభుత్వం ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు.డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అక్రమాలు జరగకపోతే సీబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలపై ఆందోళనలు జరుగుతున్న సమయంలో పాఠశాల విద్యాశాఖ అధికారులను హఠాత్తుగా ఎందుకు బదిలీ చేశారని నిలదీశారు.డీఎస్సీ నియామకాల్లో జరిగిన ఈ అవకతవకలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తిగా బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.డీఎస్సీ అక్రమాలకు వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీన అనంతపురం పవర్ ఆఫీస్ నుంచి పాతూరు వరకు నిర్వహించే ర్యాలీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కుంటిమద్ది ఓబులేసు కోరారు.

## యూపీఐ ఛార్జీలపై కేంద్రం ప్రభుత్వం క్లారిటీ.. కేవలం వారికి మాత్రమే విధింపు...

యూపీఐ ఛార్జీలపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. సామాన్యులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపింది. ఎప్పటిలాగే ఉచితంగా వ్యాపారులు, సామాన్య వినియోగదారులు యూపీఐ లావాదేవీలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. కేవలం పరిమిత వ్యాపారులకు మాత్రం నిర్దిష్ట మొత్తంలో ఛార్జీలు విధిస్తామని పేర్కొంది.యూపీఐ లావాదేవీలకు ఛార్జీలు విధించడంపై కేంద్ర ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. వినియోగదారులపై ఎలాంటి ఛార్జీలు ఉండవని స్పష్టం చేసింది. వ్యాపారులపై కూడా ఎలాంటి భారం ఉండదని తెలిపింది. ఒక నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని వ్యాపార లావాదేవీలకు మాత్రమే నామమాత్రపు రుసుంలు వర్తిస్తాయని స్పష్టం చేసింది.

# కమల్ అమృత్ వాణి-221



సత్యసంధో నరో నిత్యం విశ్వాసస్య నిలయో భవేత్।
మిథ్యావాదరతో లోకే స్వయమేవాపహీయతే॥

తాత్పర్యం.

సత్యాన్ని ఆచరించే వ్యక్తి అందరి విశ్వాసాన్ని పొందుతాడు. అబద్ధం తాత్కాలిక ప్రయోజనం ఇచ్చినా, గౌరవాన్ని కోల్పోయేలా చేస్తుంది.సత్యవంతుడి మాటకు బలం ఉంటుంది.నిజాయితీతో కూడిన జీవితం ప్రశాంతంగా ఉంటుంది.సత్యం కొన్నిసార్లు కఠినంగా అనిపించినా శ్రేయస్కరమే.నమ్మకం సత్యంతోనే నిలబడుతుంది.

సత్యసంధత వ్యక్తిత్వానికి వెలుగునిస్తుంది.సత్యమే శాశ్వత విజయానికి పునాది.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

## డీఎస్సీ ఉపాధ్యాయుల విజయాన్ని కించపరిస్తే చూస్తూ ఊరుకోం -- కదిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్

### జగన్ వ్యాఖ్యలు నిరుద్యోగ యువతను అవమానించడమే -- కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఉపాధ్యాయుల నిరసనకు సంపూర్ణ సంఘీభావం



కదిరి, కదిలించే వార్త, ఆగస్టు 08 :

కదిరి: సంవత్సరాల తరబడి కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటి డీఎస్సీ--2025 ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన యువత విజయాన్ని రాజకీయ అక్కసుతో కించపరిచే ప్రయత్నం చేస్తే తెలుగుదేశం పార్టీ చూస్తూ ఊరుకోదని కదిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ హెచ్చరించారు.కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద డీఎస్సీ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసన వైఎస్సార్‌సీపీ నేతల వ్యాఖ్యలకు గట్టి సమాధానం అని ఆయన అన్నారు.

"జగన్‌మోహన్‌రెడ్డి గారూ... డీఎస్సీ ఉద్యోగం అంటే రాజకీయ నాయకుల దయతో ఇచ్చే పదవి కాదు. అది యువత చెమటతో, కన్నీటితో, ఏళ్ల తరబడి చేసిన కష్టంతో సాధించుకున్న విజయం. ఆ విజయాన్ని ప్రశ్నించే ముందు ఒక్కసారి ఆ నిరుద్యోగ యువత పడిన కష్టాన్ని గుర్తు చేసుకోండి" అని డైమండ్ ఇర్ఫాన్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

### ఐదేళ్లు చదివిన యువతను ఐదు నిమిషాల రాజకీయంతో అవమానిస్తారా?

ఒక్క డీఎస్సీ ఉద్యోగం కోసం అభ్యర్థులు సంవత్సరాల తరబడి చదివారని, కోచింగ్‌లు తీసుకున్నారని, ఉద్యోగం వస్తుందో రాదో తెలియక ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు."ఒక అభ్యర్థి విజయం వెనుక అతని తల్లిదండ్రుల త్యాగం ఉంటుంది. కుటుంబ సభ్యుల ఆశ ఉంటుంది. ఎన్నో నిద్రలేని రాత్రులు ఉంటాయి. అలాంటి విజయాన్ని రాజకీయ విమర్శల కోసం కించపరచడం అంటే కేవలం ఒక అభ్యర్థిని కాదు.. రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగ యువతను అవమానించినట్టే" అని అన్నారు.

ఉద్యోగం ఇవ్వలేకపోయిన వారు.. ఉద్యోగం సాధించిన వారిని ప్రశ్నిస్తారా?

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూసిందని, డీఎస్సీ కోసం ఆశగా ఎదురుచూసిన అభ్యర్థుల ఆశలు నెరవేరలేదని డైమండ్ ఇర్ఫాన్ విమర్శించారు.

"మీ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం యువత రోడ్లపై తిరిగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి ఉద్యోగాలు ఇస్తే మాత్రం ఆ ఉద్యోగాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది మీ రాజకీయ అక్కసు తప్ప మరొకటి కాదు" అని మండిపడ్డారు.

"యువతకు ఉద్యోగాలు ఇవ్వలేని పాలన ఒక వైపు.. ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించే పాలన మరో వైపు. ఈ రెండింటి మధ్య తేడాను రాష్ట్ర ప్రజలు ఇప్పటికే గమనించారు" అని అన్నారు.

### 'సిఫారసు'తో కాదు.. 'సామర్థ్యం'తో ఉద్యోగం

డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు ఎవరి సిఫారసుతోనో, ఎవరి దయతోనో ఉద్యోగాలు పొందలేదని డైమండ్ ఇర్ఫాన్ స్పష్టం చేశారు."వారి చేతిలో ఉన్నది రాజకీయ నాయకుడి సిఫారసు కాదు.. పుస్తకం. వారి వెనుక ఉన్నది డబ్బు బలం కాదు.. తల్లిదండ్రుల ఆశీర్వాదం. వారి ఆయుధం రాజకీయ పలుకుబడి కాదు.. వారి ప్రతిభ. అందుకే వారి విజయాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదు" అని అన్నారు.

### నారా లోకేష్‌ను చూసి నేర్చుకోవాలి

యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని డైమండ్ ఇర్ఫాన్ అన్నారు.డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు."జగన్‌మోహన్‌రెడ్డి గారూ.. రాజకీయ విమర్శలు చేయడం కంటే యువతకు ఎలా ఉద్యోగాలు ఇవ్వాలి? విద్యా వ్యవస్థను ఎలా బలోపేతం చేయాలి? అనే విషయాలను నారా లోకేష్ బాబు గారిని చూసి నేర్చుకోండి. రాజకీయాల్లో పదవులు మాత్రమే కాదు.. బాధ్యత కూడా ఉంటుందని తెలుసుకోండి" అని హితవు పలికారు.

### ఉపాధ్యాయుల ఆవేదనకు టీడీపీ అండ

కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద తమ న్యాయమైన ఆవేదనను వ్యక్తం చేస్తున్న డీఎస్సీ ఉపాధ్యాయులకు కదిరి పట్టణ తెలుగుదేశం పార్టీ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నామని డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు."డీఎస్సీ ఉపాధ్యాయుల విజయాన్ని అవమానిస్తే సహించేది లేదు. కష్టపడి సాధించిన ఉద్యోగాన్ని ఎవరైనా రాజకీయ వివాదంగా మార్చాలని చూస్తే వారి వెనుక ఉన్న లక్షలాది యువతకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుంది" అని స్పష్టం చేశారు.డీఎస్సీ--2025లో ఉద్యోగాలు సాధించిన ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి కదిరి పట్టణ తెలుగుదేశం పార్టీ తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులుగా ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

**డైమండ్ ఇర్ఫాన్ వైఎస్ఆర్సిపి పార్టీ వారికి నా స్పష్టమైన హెచ్చరిక**

**"జగన్‌మోహన్‌రెడ్డి గారూ...**

**యువత కష్టాన్ని రాజకీయాలకు బలి చేయొద్దు.**

**ఉద్యోగం సాధించిన వారి విజయాన్ని అవమానించొద్దు.**

**పరీక్ష రాసి గెలిచిన వారి ప్రతిభను ప్రశ్నించొద్దు.**

**ఎందుకంటే ఈ రోజు మీరు విమర్శిస్తున్నది కొందరు ఉపాధ్యాయులను కాదు..**

**రేపటి ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించబోయే యువతను!"**

**కష్టం చేసిన వారికి ఫలితం దక్కాలి -- ఇదే టీడీపీ విధానం.**

**ప్రతిభతో ఉద్యోగం సాధించిన వారిని గౌరవించాలి -- ఇదే మా నినాదం.**

**డీఎస్సీ ఉపాధ్యాయుల వెంట తెలుగుదేశం పార్టీ ఉంటుంది!**

**యువత విజయమే రాష్ట్ర విజయానికి పునాది!**

# అనంతపురం జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు/ పర్యాటక ప్రదేశాలపై Customized MyStamp విడుదలకు ప్రతిపాదన

### పర్యాటక అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వం, స్థానిక ఉత్పత్తుల ప్రచారానికి తపాలా శాఖ చొరవ -- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సానుకూల స్పందన



అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, ఆగస్టు 08 :

అనంతపురం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధి, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చే వివిధ అంశాలను దేశవ్యాప్తంగా మరియు అంతర్జాతీయ స్థాయిలో ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో, భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో జబర్శీఎఐఓవస వీమ్ఘుఎజూ విడుదల చేయడానికి ప్రతిపాదన సిద్ధం చేసినట్లు అనంతపురం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ శ్రీ కె. అమర్‌నాథ్ తెలిపారు.ఈ సందర్భంగా 07-08-2026న అనంతపురం జిల్లా గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్ ని శ్రీ కె. అమర్‌నాథ్ అధికారికంగా కలిసి, అనంతపురం జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు మరియు ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను (వవఎజూశ్రీవం/శీబతీఅంఎ్రాశ్రీఘఎవం) ప్రతిబింబించే విధంగా జబర్శీఎఐఓవస వీమ్ఘుఎజూ విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను వివరించారు.అనంతపురం జిల్లాలోని 12 ప్రముఖ దేవాలయాలు/పర్యాటక ప్రదేశాలను ఎంపిక చేసి జబర్శీఎఐఓవస వీమ్ఘుఎజూలో పొందుపరచడం ద్వారా జిల్లాలోని ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక మరియు పర్యాటక వైభవాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేయడంతో పాటు అనంతపురం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం కల్పించవచ్చని జిల్లా కలెక్టర్ కి వివరించారు.దేవాలయాలు మరియు పర్యాటక ప్రదేశాలతో పాటు అనంతపురం జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిచ్చే ఇతర ముఖ్యమైన అంశాలను కూడా జబర్శీఎఐఓవస వీమ్ఘుఎజూ ద్వారా ప్రజలకు పరిచయం చేయాలనే ప్రతిపాదనలో భాగంగా అనంతపురం జిల్లాలో పండించే మిల్లెట్స్ (చిరుధాన్యాలు), హస్తకళలు, కళలు మరియు సాంస్కృతిక వారసత్వం, ప్రధాన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను కూడా ప్రదర్శించే అవకాశాన్ని వివరించారు.ఈ ప్రతిపాదనపై జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్ సానుకూలంగా స్పందించి, అనంతపురం జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు/పర్యాటక ప్రదేశాలపై జబర్శీఎఐఓవస వీమ్ఘుఎజూ విడుదలకు సంబంధించిన ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అనంతపురం జిల్లా దేవాదాయ శాఖ (Endowments Department) అధికారులను ఆదేశిస్తానని తెలిపారు.POSB పాస్‌బుక్స్ ద్వారా ప్రజా సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారంఅదేవిధంగా, ప్రజా సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయడానికి తపాలా శాఖ POSB (Post Office Savings Bank) సేవింగ్స్ పాస్‌బుక్స్ ద్వారా ప్రచారం/ప్రకటన చేపట్టే అంశంపై కూడా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.ప్రత్యేకంగా ICDS (Integrated Child Development Services) మరియు ఐవీనూ (ఐఅర్‌తీఅష్ వీవసఅఘ్శ్రీ ఢ నమ్ఘశ్రీష్ట్ర ాటటఅఎవ) శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాల సమాచారాన్ని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు తపాలా శాఖకు ఉన్న విస్తృత ప్రజా సంబంధాల వ్యవస్థను వినియోగించుకునే అంశంపై చర్చ జరిగింది.ప్రజలకు నేరుగా చేరే ాశీర్ ాటటఅఎవ ాూాదీ ఘ్ఖజఅఅస్త్రం ాఘంంఎశీశీఎం వంటి మాధ్యమాల ద్వారా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం వల్ల ప్రభుత్వ పథకాల సమాచారం మరింత విస్తృతంగా ప్రజలకు చేరే అవకాశం ఉందని సమావేశంలో వివరించారు. Dak Ghar Niryat Kendra ద్వారా అనంతపురం జిల్లాను Export Hubగా అభివృద్ధి చేయడానికి సహకారంఅనంతపురం జిల్లాను Export Hubగా అభివృద్ధి చేయడంలో తపాలా శాఖ ద్వారా అందిస్తున్న Dak Ghar Niryat Kendra (DNK) సేవలను వినియోగించుకునే అంశంపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది.జిల్లాలోని మీవీజులు (Micro, Small and Medium Enterprises), చిన్నతరహా పరిశ్రమలు, ాణఘ్రా (One District One Product), Start-ups మరియు ఇతర స్థానిక ఉత్పత్తిదారులు తయారు చేసే ఉత్పత్తులను దేశీయ మార్కెట్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు ఘ్న +ఫ్ఘుతీ చీఅతీమ్ ఖవఅతీఘ (ఐచీఖ) ద్వారా తపాలా శాఖ అందిస్తున్న సౌకర్యాలను విస్తృతంగా వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ కి వివరించారు.స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌ను కల్పించడం ద్వారా మీవీజులు, చిన్నతరహా పరిశ్రమలు, ాణఘ్రా ఉత్పత్తిదారులు మరియు బజూంకు కొత్త వ్యాపార అవకాశాలు లభించడంతో పాటు, జిల్లాలో ఉపాధి మరియు ఆర్థిక కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.అనంతపురం జిల్లాలో ఉత్పత్తి అయ్యే ప్రత్యేక ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు చేరవేయడంలో ఘ్న +ఫ్ఘుతీ చీఅతీమ్ ఖవఅతీఘ (ఐచీఖ) ఒక సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని, ఈ దిశగా జిల్లా యంత్రాంగం, తపాలా శాఖ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించారు.జిల్లా అభివృద్ధికి తపాలా శాఖ -- జిల్లా యంత్రాంగం సమన్వయంఅనంతపురం జిల్లాలో పర్యాటక రంగ ప్రోత్సాహం, దేవాలయాలు మరియు పర్యాటక ప్రదేశాల ప్రచారం, సాంస్కృతిక మరియు చారిత్రక వారసత్వ పరిరక్షణ, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహం, ప్రజా సంక్షేమ పథకాలపై అవగాహన, మీవీజులు మరియు చిన్నతరహా పరిశ్రమలకు మార్కెట్ విస్తరణ, అంతర్జాతీయ ఎగుమతుల ప్రోత్సాహం వంటి వివిధ అంశాల్లో జిల్లా యంత్రాంగం మరియు తపాలా శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయడం ద్వారా జిల్లాకు మరింత ప్రయోజనం చేకూరుతుందని శ్రీ కె. అమర్‌నాథ్ తెలిపారు.జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం పట్ల తపాలా శాఖ తరఫున శ్రీ కె. అమర్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ అధికారిక సమావేశంలో శ్రీ పి. ఉమామహేశ్వర, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ మరియు శ్రీ జె. రామ్ మోహన్ రెడ్డి, దీణవీజు, అనంతపురం డివిజన్ పాల్గొన్నారు.

-- శ్రీ కె. అమర్‌నాథ్
సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్
అనంతపురం డివిజన్

# స్పోర్ట్స్ అసోసియేషన్లలోనే 'డీఎస్సీ' అక్రమాలకు బీజం

**-- అసోసియేషన్లలో చక్రం తిప్పిన కూటమి నేతలు**
**-- డీఎస్సీ నియామకాల మెరిట్ జాబితా ఎందుకు విడుదల చేయలేదు?**
**-- నారా లోకేష్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ కోరాలి**
**-- హఠాత్తుగా కోన శశిధర్, ఎస్ఎస్ రావత్ బదిలీల్లో మతలబేంటి?**
**-- రిలే దీక్షలు చేస్తున్న వారిని రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ అంటారా?**
**-- అధికార పార్టీ నేతలు నోరుంది కదా అని మాట్లాడితే ఖబడ్దార్**
**-- పరీక్షల నిర్వహణలో లోపాలను ప్రశ్నిస్తే గొంతునొక్కుతారా?**
**-- ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఎప్పుడు చెల్లిస్తారు?**
**-- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్న**
**-- అనంతపురంలో విజయవంతంగా మూడో రోజు రిలే నిరాహార దీక్షలు**
**-- క్షీణించిన శాంతిభద్రతలకు నిరసనగా శిబిరం వద్ద శాంతికపోతాలు ఎగురవేసిన అనంత వెంకటరామిరెడ్డి**







అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 08 :డీఎస్సీ--2025కు సంబంధించి అక్రమాలకు స్పోర్ట్స్ అసోసియేషన్లలోనే బీజం పడిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. ఆయా అసోసియేషన్లలో అధికార పార్టీ నేతలే ఉన్నాయని, వారి ప్రమేయంతోనే స్పోర్ట్స్ కోటాలో అక్రమాల జరిగాయన్నారు. డీఎస్సీ అక్రమాలతో పాటు విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో వైసీపీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. శనివారం దీక్షలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ, లీగల్ సెల్, సోషల్ మీడియా, ఐటి, బూత్ కమిటీ, ప్రచారం విభాగం, వాణిజ్య విభాగాలతో పాటు 24వ డివిజన్ నుంచి 50వ డివిజన్ల వరకు, రుద్రంపేట, అనంతపురం రూరల్ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. ముందుగా రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలకు నిరసనగా శిబిరం వద్ద శాంతి కపోతాలను అనంత వెంకటరామిరెడ్డి ఎగురవేసి రిలే దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ ఫలితాలు విడుదలయ్యాక మెరిట్ జాబితాను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. స్పోర్ట్స్ కోటాలో బేరసారాలు చేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో 6100 టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే అప్పట్లో 25 వేల పోస్టులున్నాయి, వాటిని భర్తీ చేయాలంటూ టీడీపీ నేతలు ఆందోళనలు చేశారన్నారు. తీరా కూటమి అధికారంలోకి వచ్చాక 6100 పోస్టుల నోటిఫికేషన్‌ను రద్దు చేసి 16 వేల పోస్టులకు కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. తీరా నియామక ప్రక్రియలో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. డీఎస్సీలో అన్యాయానికి గురైన వారి తరపున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనలు చేస్తుంటే చంద్రబాబు, అధికార పార్టీ నేతలు చులకనగా మాట్లాడుతున్నారని తెలిపారు. డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు జరగకపోతే సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. డీఎస్సీ కన్వీనర్‌ను పక్కన పెట్టి ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్‌కు పరీక్షల నిర్వహణ ఇవ్వడంలో లోగుట్టు ఏముందన్నారు. తాము ఆందోళనలు చేస్తుంటే గొంతునొక్కాలని ప్రయత్నిస్తున్నారని, అక్రమ అరెస్టులు, కేసులు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్‌కానిస్టేబుల్, గ్రూప్ 2 ఇతరత్రా పోస్టులు ఖాళీగా ఉన్నా మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం..ప్రిపేర్ అవ్వండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని తెలిపారు. ఇదంతా డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనన్నారు. కర్నూలులో టీచర్లతో నిరసనలు చేయిస్తున్నారని, తాము అర్హులైన అభ్యర్థులకు వ్యతిరేకం కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఎలాంటి అర్హత లేకుండా స్పోర్ట్స్, దివ్యాంగుల కోటాలో కొంత మంది ఉద్యోగాలు పొందారని.. పరీక్షల నిర్వహణలో లోపాలను తాము ప్రశ్నిస్తున్నామని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 470 మంది జాబితా ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లు ఉన్నారంటూ అధికార పార్టీ నేతలు విమర్శించడాన్ని అనంత వెంకటరామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. అలా విమర్శలు చేస్తున్న వారు పక్కన ఎవరెవరు ఉన్నారో చూసుకోవాలని చురకలంటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లు దాటిందని, ఫీజురీయింబర్స్‌మెంట్ కింద రూ.9500 బకాయిలు చెల్లించాలని కోరడం తప్పా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి 25 నెలలు గడిచినా ఎందుకు ఇవ్వలేదన్నారు. డీఎస్సీ నియామకాలకు సంబంధించి అక్రమాలు జరగకపోతే.. నిజంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ కోరి తన నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. డీఎస్సీ అక్రమాలపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్న సమయంలో పాఠశాల విద్య సెక్రటరీ కోన శశిధర్‌ను, జీఏడీ స్పెషల్ సీఎస్ రావత్‌లను హఠాత్తుగా ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. ఇదే సమయంలో గతంలో టీటీడీలో పని చేసిన శ్యామలరావును పాఠశాల విద్య సెక్రటరీగా ఎందుకు తీసుకొచ్చారు? ఇప్పుడు ఆయనతో ఎలాంటి కథలు చెప్పించబోతున్నారు? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ఎక్కడకు వెళ్లినా గంజాయి బ్యాచ్.. గంజాయి బ్యాచ్ అంటున్నారని.. నిజంగా రాష్ట్రంలో గంజాయి దొరుకుతుంటే ఈ ప్రభుత్వ వైఫల్యం కాదా? అని అన్నారు. అధికార పార్టీ నేతలు నోరుంది కదా అని ఎలాపడితే అలా మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ రోజుతో రిలే నిరాహార దీక్షలు మాత్రమే ముగుస్తాయని, తమ ఉద్యమం కాదని స్పష్టం చేశారు. ఈ నెల 10వ తేదీన డీఎస్సీ అక్రమాలపై అనంతపురం నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



# ముగిసిన నిరాహారదీక్షలు...

## ఈ నెల 10వ తేదీన జరగబోయే నిరసన ర్యాలీకి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చిన 'అనంత'















అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 08 :విద్యార్థి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం అనంతపురంలోని మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుండి జరుగుతున్న దీక్షలు శనివారం సాయంత్రం ముగిశాయి. శనివారం నాడు దీక్షలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ, లీగల్ సెల్, సోషల్ మీడియా, ఐటి, బూత్ కమిటీ, ప్రచారం విభాగం, వాణిజ్య విభాగాలతో పాటు 24వ డివిజన్ నుంచి 50వ డివిజన్ల వరకు, రుద్రంపేట, అనంతపురం రూరల్ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన డీఎస్సీ అక్రమాలపై అనంతపురం నగరంలోని పవర్ ఆఫీస్ నుంచి పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# ధర్మవరంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ కార్యక్రమం.. పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్**

**- వ్యసన రహిత యువతతోనే వికసిత్ భారత్ నిర్మాణం...**

**- డ్రగ్స్‌కు దూరంగా ఉండండి.. డ్రీమ్స్‌ను అందుకోండి...**

**- వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు..**

**- చెడు వ్యసనాలను వీడి.. దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి...**

**- మత్తుకు బానిసలు కావద్దు.. వికసిత్ భారత్‌కు నిర్మాతలు కండి...**

**- వ్యసన రహిత సమాజం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలి...**

**- యువతను వ్యసనాల నుంచి కాపాడటమే మనందరి బాధ్యత...**

**- యువత ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉంటేనే 2047 నాటికి వికసిత్ భారత్ సాధ్యం...**

**--- -- -- -- మంత్రి సత్యకుమార్ యాదవ్....**













ధర్మవరం, కదిలించే వార్త, ఆగస్టు 08 :-- వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడిపినప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ అన్నారు. "మనకు కావాల్సింది సిగరెట్ కాదు.. శిక్షణ; మద్యపానం కాదు.. మంచి భవిష్యత్తు; బీరు కాదు.. బ్రైట్ ఫ్యూచర్; గుట్కా కాదు.. మంచి గుర్తింపు; డ్రగ్స్ కాదు.. డ్రీమ్స్; నిషా కాదు.. నైపుణ్యం; వ్యసనం కాదు.. విజయం" అనే సందేశంతో ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ధర్మవరం పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "10 జతీశీతీవ చాంంఅప్లైశీఅ-ఖీతీవవ ప్రాశ్రీవసస్త్రవ వీవస్తు ఝఎజూఖఅస్త్రఅ" -- నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం 1938లో ప్రారంభమై దాదాపు తొమ్మిది దశాబ్దాలుగా కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం కోసం విశేష సేవలు అందిస్తోందని మంత్రి కొనియాడారు. సమాజంలో ప్రతి పని చేయడానికి దీంతో నాకు ఏం లాభం? అనే స్వార్థపూరిత ఆలోచన పెరుగుతున్న సమయంలో ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సమాజం సంతోషంగా ఉంటే చాలని భావిస్తూ సేవ చేస్తున్న బ్రహ్మకుమారి సంస్థల సేవలు ఎంతో గొప్పవని అన్నారు. ఇటువంటి నిస్వార్థ సేవా సంస్థలు సమాజ నిర్మాణంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరి జీవితం వేగవంతమైపోయిందని, ఇతరుల గురించి, ముఖ్యంగా సమాజం గురించి ఆలోచించడానికి కూడా సమయం లేకుండా పోతున్న పరిస్థితుల్లో దేశ భవిష్యత్తైన పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడం ఎంతో గొప్ప విషయమని మంత్రి అన్నారు. మన కుటుంబంలోని పిల్లలతో పాటు సమాజంలోని పిల్లలందరినీ మన పిల్లలుగా భావించి, వారు చెడు అలవాట్లకు, వ్యసనాలకు లోనుకాకుండా కాపాడి, వారి భవిష్యత్తుకు మంచి పునాదులు వేయడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని చెప్పారు. నేటి సమాజంలో వ్యసనాలు విస్తరిస్తున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని, మద్యం, బీడి, సిగరెట్, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌తో పాటు ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ వ్యసనం కూడా పిల్లలు, యువతపై ప్రభావం చూపుతోందని మంత్రి అన్నారు. వ్యసనాల వల్ల వ్యక్తి శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యం, చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం, సామాజిక జీవితం కూడా దెబ్బతింటాయని తెలిపారు. వ్యసనాలకు బానిసైన వ్యక్తిలో కోపం, మానసిక సమస్యలు, ఇతరులపై దాడి చేసే స్వభావం వంటి అనేక మార్పులు రావచ్చని, చివరకు వ్యక్తి భవిష్యత్తుతో పాటు కుటుంబం, సమాజం కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. ఇటీవల రాజమండ్రిలో మద్యం మత్తులో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనను మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. మద్యం సేవించిన ఇద్దరు యువకులు వాహనాన్ని వేగంగా నడిపి, అనంతరం జరిగిన ఘటనలో ఒక ప్రతిభావంతురాలైన యువతి తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయిన ఘటన ఎంతో బాధాకరమన్నారు. ఆమె వైద్య విద్యలో ప్రతిభ కనబరిచి ఉన్నత చదువులు చదువుతున్నప్పటికీ తన తప్పు లేకుండానే ప్రాణాలు కోల్పోయిందని, ఒక కుటుంబం బిడ్డను కోల్పోవడమే కాకుండా రాష్ట్రం ఒక మంచి వైద్యురాలిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం లేదా డ్రగ్స్ మత్తులో తీసుకునే నిర్ణయాల పర్యవసానాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఇటువంటి ఘటనలు తెలియజేస్తున్నాయని అన్నారు. మత్తులో జరిగే చిన్న గొడవలు కూడా ప్రమాదాలు, హత్యలు, హింస, ఇతర నేరాలకు దారితీస్తున్నాయని, ఆ తర్వాత నిందితుల భవిష్యత్తు కూడా నాశనమవుతుందని హెచ్చరించారు. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు తన విద్యార్థి దశలో జరిగిన ఒక సంఘటనను కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తుచేశారు. కాలేజీలో ఎన్నికల్లో జనరల్ సెక్రటరీగా గెలిచిన సమయంలో సీనియర్ల ప్రోత్సాహంతో సిగరెట్ తాగిన సందర్భాన్ని వివరించారు.

# నేతన్న సేవలో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ధర్మవరం ప్రజలకు కృతజ్ఞతలు

**నేతన్నల ఐక్యతకు, ఆత్మీయతకు ధర్మవరం వేదికగా నిలిచింది...**

**నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న రూ.25 వేల సాయం ప్రతి అర్హుడికీ అందుతుంది...**

**సాంకేతిక కారణాలతో లబ్ధి ఆలస్యమైనా ఆందోళన అవసరం లేదు...**

**అర్హులైన ప్రతి నేతన్నకు రూ.25 వేల సాయం అందుతుంది...**

**ఒక్క అర్హ నేతన్న కూడా నష్టపోరు.. 'నేతన్న సేవలో' సాయం అందని వారందరికీ రూ.25 వేలు అందుతుంది...**

**---------- హరీష్ బాబు**



ధర్మవరం, కదిలించే వార్త, ఆగస్టు 08:-- 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ధర్మవరం కదిరిగేట్ వద్ద నిర్వహించిన నేతన్న సేవలో కార్యక్రమాన్ని ఘనవిజయం చేసిన ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు, చేనేత కార్మికులకు, నేతన్నలకు, నేతమ్మలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారి తరపున ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. చేనేత రంగానికి గౌరవం కల్పిస్తూ, నేతన్నల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నేతన్న సేవలో కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు, చేనేత కుటుంబాలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమని హరీష్ బాబు పేర్కొన్నారు. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, ధర్మవరం ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన గొప్ప వారసత్వమని ఆయన అన్నారు. తరతరాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నేతన్నల శ్రమ, నైపుణ్యం, కళా ప్రతిభకు సమాజం గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నల సంక్షేమం, వారి ఆర్థిక భరోసా, చేనేత రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం సంతోషకరమన్నారు.

## రూ.25 వేల నేతన్న సేవలో సాయంపై ఆందోళన అవసరం లేదు.....

నేతన్న సేవలో పథకం కింద అర్హత ఉన్నప్పటికీ కొంతమందికి రూ.25 వేల ఆర్థిక సాయం ఇంకా అందలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హరీష్ బాబు స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక సమస్యలు, డేటా సంబంధిత అంశాలు లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల లబ్ధి జమ కావడంలో కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అటువంటి కేసులను లెఫ్ట్‌ఓవర్ కేసులుగా పరిగణించి పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న నేతన్న సేవలో పథకం ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో ప్రస్తుతం లబ్ధి అందని నేతన్నలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రతి అర్హుడికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హరీష్ బాబు భరోసా ఇచ్చారు.

## నేతన్నల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది...

చేనేత కార్మికుల సంక్షేమం, ధర్మవరం పట్టు చీరకు మరింత గుర్తింపు తీసుకురావడం, చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం కోసం మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని హరీష్ బాబు తెలిపారు. నేతన్నల సంక్షేమం కోసం పింఛన్లు, ఉచిత విద్యుత్, నేతన్న సేవలో వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ధర్మవరం చేనేత రంగానికి మరింత ఊతమిచ్చేలా మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్, ఆధునిక మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్, బ్రాండింగ్ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. ధర్మవరం పట్టు చీరకు దేశ, విదేశాల్లో మరింత గుర్తింపు తీసుకురావడం, నేతన్నల ఆదాయాన్ని పెంచడం, చేనేత వృత్తిని భవిష్యత్ తరాలకు మరింత బలోపేతంగా అందించడం కోసం మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో నిరంతరం కృషి చేస్తామని హరీష్ బాబు పేర్కొన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు, చేనేత సంఘాల ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు, యువత, ప్రజాప్రతినిధులు మరియు ధర్మవరం ప్రజలందరికీ హరీష్ బాబు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నేతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి కార్యక్రమానికి ప్రజల సహకారం ఉండాలని, ధర్మవరం చేనేత రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అందరం కలిసి పనిచేద్దామని హరీష్ బాబు పిలుపునిచ్చారు.






# ఆటో డిజిటలైజేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**ఆటో ప్రయాణికుల భద్రతకు డిజిటల్ భరోసా.. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్**

**ఆటో ప్రయాణికుల భద్రతకు డిజిటల్ రక్షణ కవచం.. క్యూఆర్ కోడ్‌తో మరింత భద్రత....**

**- ఒకరిద్దరి తప్పిదాలకు మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు చెడ్డపేరు రాకూడదు...**

**- ఆటో డ్రైవర్ల వృత్తికి గౌరవం.. ప్రయాణికుల భద్రతకు భరోసాగా ఈ క్యూఆర్ కోడ్...**

**- అపనమ్మకం కాదు.. భద్రత కోసం క్యూఆర్ కోడ్...**

**- ఆటో డ్రైవర్ల గౌరవం.. ప్రయాణికుల భద్రతే మా లక్ష్యం...**

**- ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోండి.. భవిష్యత్తుకు భద్రత పొందండి...**

**- కష్టపడే ఆటో డ్రైవర్ల కుటుంబాలకు భవిష్యత్తులో ఆర్థిక భద్రత అవసరం...**

**- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వ అండగా ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ప్రభుత్వం అందిస్తోంది..**

**- అండ.. పథకాలపై మంత్రి సత్యకుమార్ కీలక సూచనలు...**

**-- -- -- --ఆటోలకు క్యూఆర్ కోడ్ విధానం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్**

ధర్మవరం, కదిలించే వార్త, ఆగస్టు 08:-- ప్రజా రవాణా వ్యవస్థలో ఆటో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, రాత్రి--పగలు, ఎండ--వాన, పండుగ--పబ్బం అనే తేడా లేకుండా ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే ఆటో డ్రైవర్ల సేవలను అభినందిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరం పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఆటో రిక్షాల డిజిటల్ రిజిస్ట్రేషన్, క్యూఆర్ కోడ్ ఆధారిత భద్రతా విధానం కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు... ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ సోదరులు, పోలీసు అధికారులు, సంబంధిత సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రయాణికుల భద్రతను మరింత బలోపేతం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆటోలకు డిజిటల్ నంబర్లు, క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమైన చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా డ్రైవర్, యజమానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ఎ4 సైజు డిస్‌ప్లే బోర్డుతో పాటు రెండు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఆటోల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణించే వ్యక్తులు వాహనంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను గూగుల్ లెన్స్ ద్వారా స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్, యజమానికి సంబంధించిన వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన అనంతరం ప్రయాణికులు డ్రైవర్, యజమాని వివరాలను చూడటంతో పాటు అవసరమైతే వాటిని ప్రింట్ చేసుకోవచ్చు. తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు వాట్సప్ ద్వారా ఆటో వివరాలను షేర్ చేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాహనం ప్రయాణిస్తున్న ప్రాంతాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసే ట్రాక్ లోకేషన్ సదుపాయం కూడా ఉంటుందని వివరించారు. అలాగే డ్రైవర్ ప్రవర్తన, సేవలపై ప్రయాణికులు రేటింగ్ ఇవ్వవచ్చని, ఆటోలో వస్తువులు మరిచిపోయినా లేదా ప్రయాణ సమయంలో ఏదైనా ఇబ్బంది





ఎదురైనా క్యూఆర్ కోడ్ ద్వారా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో నేరుగా 112కు కాల్ చేసే అవకాశం ఉండటంతో పాటు సమీపంలోని పోలీస్ స్టేషన్ వివరాలు, పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు కూడా క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకునే సౌకర్యం ఉంటుందని చెప్పారు. ఆటోలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయడం ఆటో డ్రైవర్లపై అపనమ్మకంతో కాదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారిలో ఒకరిద్దరి కారణంగా ఏదైనా అవాంఛిత ఘటన జరిగితే మొత్తం ఆటో డ్రైవర్ల వ్యవస్థకు చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగానే ఈ డిజిటల్ విధానాన్ని తీసుకురావడం జరుగుతోందని వివరించారు. ఒకరిద్దరి కారణంగా మూడు లక్షల మంది ఆటో డ్రైవర్లకు చెడ్డపేరు రాకుండా చూడటంతో పాటు ఆటో డ్రైవర్ల వృత్తిపై సమాజంలో మరింత నమ్మకం పెంచడం, ప్రయాణికులకు భద్రత కల్పించడం, ఆటో డ్రైవర్లకు కూడా గౌరవం పెంచడం ఈ చర్య ప్రధాన ఉద్దేశమన్నారు. శాంతిభద్రతలను కాపాడటం, అవాంఛిత ఘటనలు జరగకుండా ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడం పోలీసు శాఖ బాధ్యత అని మంత్రి అన్నారు. పోలీసు శాఖ అత్యంత ఒత్తిడిలో పనిచేసే వ్యవస్థ అని, ఎక్కడైనా చిన్న సంఘటన జరిగినా దాని ప్రభావం మొత్తం పోలీసు వ్యవస్థపైనా, ప్రభుత్వంపైనా, సమాజంపైనా పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడం అవసరమన్నారు. ధర్మవరం ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను మంత్రి అభినందించారు. పేకాట, అధిక వడ్డీల వేధింపులు వంటి సామాజిక సమస్యలపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించడం వల్ల గతంతో పోలిస్తే పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వచ్చిందని చెప్పారు. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తే సమాజంలో అనేక చెడు పరిణామాలను అరికట్టవచ్చని అన్నారు. తాను ఈ కార్యక్రమానికి కొంత ఆలస్యంగా రావడానికి కారణం వ్యసన రహిత భారత్ నిర్మాణం, నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన





కార్యక్రమంలో పాల్గొనడమేనని మంత్రి తెలిపారు. ప్రజలు వ్యసనాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటో డ్రైవర్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఆటో డ్రైవర్లు, వ్యవసాయ రంగ కార్మికులు, గిగ్ వర్కర్లు తదితర అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ(వ-చాష్ట్రత్తీఖుఎ) పోర్టల్‌లో నమోదు చేసుకుని అందుబాటులో ఉన్న ప్రయోజనాలను పొందాలని కోరారు. అదేవిధంగా ప్రమాదాల నుంచి ఆర్థిక రక్షణ పొందేందుకు ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి పథకాలపై కూడా ఆటో డ్రైవర్లు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. తక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లించడం ద్వారా భవిష్యత్తులో కుటుంబానికి ఉపయోగపడే బీమా రక్షణ పొందే అవకాశం ఉందని వివరించారు. ఆటో డ్రైవర్లకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ధర్మవరం నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని భావిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ-శ్రమ(వ-చాష్ట్రత్తీఖుఎ)తో పాటు బీమా పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న ఇతర సంక్షేమ పథకాలలో అర్హులైన ఆటో డ్రైవర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనుకోకుండా ఈ కార్యక్రమం సందర్భంగా ఆటో డ్రైవర్ సోదరులను కలిసే అవకాశం వచ్చిందని, మరోసారి ఆటో డ్రైవర్లందరినీ ఒకచోట సమావేశపరిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల గురించి పూర్తిగా వివరించి, వాటి ప్రయోజనాలను వారు పొందేలా చర్యలు తీసుకోవాలన్నది తన ఉద్దేశమని చెప్పారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి ఆలోచించే ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆటో డ్రైవర్ల సేవలు వంటి పథకాల ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల ఆదాయంపై కొంత ప్రభావం పడినప్పటికీ, మహిళల ఆర్థిక సాధికారత, ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు తదితర అంశాల్లో ఈ పథకం ద్వారా ప్రయోజనాలు కలుగుతున్నాయని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలు ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందడం పెరిగిందని, కుటుంబ సభ్యులను తరచుగా కలుసుకునే అవకాశం ఏర్పడిందని మంత్రి తన అనుభవాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాల వల్ల ఆటో డ్రైవర్లకు కొంత ఆదాయ నష్టం ఏర్పడే పరిస్థితి ఉన్నప్పటికీ, ఆ లోటును భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచిస్తున్నారని మంత్రి తెలిపారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సంబంధించిన పథకాలను కొనసాగిస్తూ, అర్హులైన వారికి ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆటో డ్రైవర్ల వృత్తి సమాజంలో ఎంతో కీలకమైనదని, ఆ వృత్తికి ఉన్న గౌరవం మరింత పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, పోలీసు అధికారులు సూచించే భద్రతా చర్యలకు సహకరించడం, ఎలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ఆటో డ్రైవర్లు తమ వృత్తికి మరింత గౌరవాన్ని తీసుకురావాలని కోరారు. ఎంతో కష్టపడి కుటుంబాలను పోషిస్తూ, పిల్లలకు మంచి భవిష్యత్తు అందించేందుకు శ్రమిస్తున్న ఆటో డ్రైవర్లు ఎక్కడా తమ వృత్తికి చెడ్డపేరు రాకుండా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పోలీసు అధికారులు సూచించే భద్రతా చర్యలకు సహకరించి, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆటో ప్రయాణికుల భద్రతను పెంచడంతో పాటు ఆటో డ్రైవర్ల వృత్తిపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించేందుకు డిజిటల్ క్యూఆర్ కోడ్ విధానం దోహదపడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీసు శాఖ, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు సమన్వయంతో పనిచేస్తే మరింత సురక్షితమైన, బాధ్యతాయుతమైన ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించగలమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ధర్మవరం డిఎస్పి బీవీ జగన్నాథరాజు, ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి, సీఐ రెడ్డప్ప, సీఐ జయ నాయక్.... పోలీస్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి..ఎమ్మెల్యే అమిలినేని

**వైసీపీ ఐదేళ్లు ఒక్కరికి కూడా ముఖ్యమంత్రి సహాయనిధి అందించలేదు**

**డీఎస్సీ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తే..వైసీపీ నాయకుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారు..**

**ఇప్పటి వరకు డీఎస్సీలు నిర్వహించింది టీడీపీ ప్రభుత్వమే**

**మద్యం నుంచి వచ్చిన సొమ్మంత తాడేపల్లి ప్యాలెస్ కు తరలించాడు**

**తాగు, సాగు నీటి ఇబ్బందులకు గత వైసీపీ నాయకుల పాపమే**

**ఐదేళ్లు కళ్యాణదుర్గం వైపు చూడని రంగయ్య నేడు కుటిల రాజకీయాలు చేస్తున్నారు..**

**నాయకులకు, ప్రజలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చాం**

**మీడియా మిత్రులకు స్థలం కేటాయించి ప్రెస్ క్లబ్ ను నిర్మిస్తా**

**53 మంది బాధితులకు 33,16,801 రూపాయలు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే, నాయకులు**

**వింత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు 50,000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే**

కళ్యాణదుర్గం, కదిలించే వార్త, ఆగస్టు 08 :కళ్యాణదుర్గం ప్రాంతంలో ఎక్కువగా బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎక్కువగా ఉన్నారని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దరకాస్తు చేసుకున్న ఏ ఒక్కటి కూడా వెనక్కి పంపకుండా ఎప్పటికప్పుడు నిధులు కేటాయించి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందిస్తున్నారని గత ప్రభుత్వంలో ఒక్కరికి కూడా అందించిన పాపాన పోలేదని ఇది నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పేర్కొన్నారు.. నేడు ప్రజావేదిక నందు టీడీపీ సీనియర్ నాయకులు, మండల పార్టీ కన్వీనర్లు, మార్కెట్ యార్డు చైర్మన్, డైరెక్టర్లు, పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో 53 మంది బాధితులకు 33,16,801 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పంపిణీ చేశారు..అందులో తక్కిలపాటి నగేష్ 58,633 రూపాయలు, ఏ శంకరప్ప 31,961 రూపాయలు, బోయ అంజినమ్మ 67,113 రూపాయలు టీ మహ్మద్ ఫజిల్ 20,732 రూపాయలు, కే లక్ష్మీదేవి 35,000 రూపాయలు, బీ దొనప్ప 30,514 రూపాయలు, జీ సాగర్ 25,084 రూపాయలు, జీ చిక్కన్న డెత్ గొల్ల ఈరక్క 63,961 రూపాయలు, ఈరన్న 20,000 రూపాయలు, శీబాయి శ్రీనివాసులు 25,000, తల్లపల్లి రామరత్న డెత్ తల్లపల్లి జయవీరయ్య 44,227 రూపాయలు, మమతమ్మ 40,350 రూపాయలు, బుడబుక్కల మౌనిక 46,625 రూపాయలు, దాసరి దివ్య శ్రీ చైల్డ్ ఆఫ్ దాసరి మంజుల 68,900 రూపాయలు, పీ శకుంతలమ్మ 25,351 రూపాయలు, పూజారి ఈరన్న 27,299 రూపాయలు, పెద్ద నాగప్ప గారి వీరేంద్ర 67,038 రూపాయలు, గొల్ల సుమలత 20,000 రూపాయలు, కొలిమి నుర్జాహన్ 47,919 రూపాయలు, కుమ్మర తిప్పేస్వామి డెత్ కే లక్ష్మీదేవి 68,961రూపాయలు, మద్దిపాటి ధనలక్ష్మి 47,884 రూపాయలు, మదలా చంద్రకళ 27,114 రూపాయలు, సీ





అనురాధ 20,000 రూపాయలు, మలిశెట్టి లక్ష్మీ 25,574, గొల్ల హర్షవర్ధన్ చైల్డ్ జ్యోతి 23,400 రూపాయలు, వర్లి చంద్రమోహన్ 20,000 రూపాయలు, టీ మహ్మద్ కాజీమ్ చైల్డ్ యాషిన్ 20,500 రూపాయలు, కంద్ర వెంకటేషులు 25,000 రూపాయలు, కురుబ ఆంజనేయులు 55,000 రూపాయలు, తప్పయ్య గారి పార్వతి 20,000 రూపాయలు, ఈ బాగ్యమ్మ 30,028 రూపాయలు, బోయ రామలక్ష్మి 30,028 రూపాయలు, అష్మా భాను 35,914 రూపాయలు, ఉప్పర బాగ్యమ్మ 30,028 రూపాయలు,గొల్ల నాగభూషణ 31,843 రూపాయలు, యర్రబెల్లి నాగరాజు 29,300 రూపాయలు, ఎన్ వీ మంజుల 23,400 రూపాయలు, ఎనుముల జాన్వీ చైల్డ్ శ్రావణి 36,084 రూపాయలు, బెరీలా విగ్నేష్ చైల్డ్ హరిజన మైలార జ్యోతి 23,927 రూపాయలు, దూలం అంజినమ్మ 41,143 రూపాయలు, కే జయశ్రీ 23,920 రూపాయలు, కాకిమని తిమ్మప్ప 32,551 రూపాయలు, ఎమ్ వినోద్ కుమార్ 55,250 రూపాయలు, నీలి సింగిరప్ప 95,000 రూపాయలు, తలారి కొండప్ప 1,69,459 రూపాయలు, ఉదయప్ప గారి బొమ్మయ్య 2,54,011 రూపాయలు, జగదీష్ 1,50,819 రూపాయలు, భీమన్న గారి కరియన్న 1,94,877 రూపాయలు, ఎల్ తేజస్విని 2,58,896 రూపాయలు, మేడా రామకృష్ణ డెత్ రామలక్ష్మి 1,50,047 రూపాయలు, వై రమేష్ 1,70,848 రూపాయలు, ఈడిగ రత్నాకర్ గౌడ్ 1,55,550, గాజుల కరియప్ప 1,74,738 రూపాయలు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా ఎలాంటి వివాదాలు కానీ, కోర్టు కేసులు కానీ లేకుండా ఒకే సారి 16,500 మంది ఉపాధ్యాయ పోస్టులు అందిస్తే వైసీపీ సైకో జగన్ మాత్రం అసత్య ఆరోపణలు చేస్తూ ఎన్నో ఏళ్ళు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధిస్తే వారిని







అవమానించే విధంగా అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, రాజశేఖర్ రెడ్డి కానీ జగన్ కానీ ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన





దాకలాలు లేవని ఇప్పటి వరకు ఇచ్చిన నోటిఫికేషన్లు అన్ని కూడా చంద్రబాబు నాయుడు గారు ఇచ్చినవే అని తెలిపారు.ఎన్టీఆర్ గారు టీడీపీ పార్టీని స్థాపించి 43 ఏళ్ళు అయిన ఇంత పటిష్టంగా ఉంది అంటే అందుకు బడుగు, బలహీన వర్గాలు అండగా ఉండటం పార్టీని మరింత ఉన్నతంగా నడుపుతున్న మా యువ నాయకుడు లోకేష్ గారు బలోపేతం చేయడమే ముఖ్య కారణమని తెలిపారు..ఉపాధ్యాయులను జగన్ మద్యం దుకాణాల వద్ద కాపలా ఉంచాడని, ఆ వచ్చిన డబ్బు మొత్తం తాడేపల్లి ప్యాలెస్ కు తరలించాడని, ప్రస్తుతం గ్రామాల్లోకి వెలుతుంటే అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, తాగునీళ్లు మాత్రం అడుగుతున్నారని డానికి కారణం 2019 నుంచి 2024 వరకు ఇక్కడ పనిచేసిన మంత్రి దోచుకోవడానికి సరిపోతే మరొక ఆయన అప్పటి ఎంపీ కళ్యాణదుర్గం వైపు కన్నెత్తి కూడా చూసిన పాపాన పోలేదన్నారు..యస్విత శ్రీ, జైశ్విక శ్రీ అనే చిన్నారులకు వింత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని వైద్య ఖర్చులకు 50,000 రూపాయలను ఎమ్మెల్యే అందజేశారు..

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710